


# గోడౌన్ల కార్యాచరణ సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలో నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్, నాబార్డ్, పరిశ్రమల శాఖ, ఎల్ డీ ఎం తహసీల్దార్లు, మార్క్ ఫెడ్, మార్కెటింగ్ శాఖ ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎఫ్ సీఐ, ఎస్ డబ్ల్యూసీ, మార్క్ ఫెడ్ తదితర శాఖల ఆధ్వర్యంలో పంట ఉత్పత్తుల నిల్వ కోసం గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. స్థలాలు గుర్తించాలని, నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరితగతిన పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, మార్క్ ఫెడ్ అధికారి హబీబ్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ నరసింహ, నాబార్డ్ డీడీఎం దిలీప్, పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు, ఎస్ డబ్ల్యూసీ, ఎఫ్ సీ ఐ అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దుల్లో పోలీసు నిఘా!

**బక్రీద్ వేళ జన్నారం చెక్ పోస్టు వద్ద ఏసీపీ తనిఖీలు**

**పశువుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం**

**నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



**జన్నారం, మే 14 (జనం పవర్):** బక్రీద్ పండుగను పురస్కరించుకుని పశువుల అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ రంగంలోకి దిగారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం సాయంత్రం జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందనపల్లి వద్ద ఉన్న అంతర్ జిల్లా ప్రత్యేక చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బందికి ఏసీపీ కీలక సూచనలు చేశారు. ఇతర జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల సరిహద్దుల నుండి పశువులను అక్రమంగా తరలించే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వాహనాల తనిఖీ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అనుమతించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా, క్రూరంగా పశువులను తరలించే వారిపై కఠిన కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించేది లేదని ఏసీపీ హెచ్చరించారు. సరిహద్దుల గుండా అక్రమ రవాణా జరగకుండా 24 గంటల పాటు నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. పండుగ పూట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. ఈ తనిఖీలో ఏసీపీ వెంట ఏఎస్ఐ ఉమేష్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ దేవన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల్లో నిర్మలా జగ్గారెడ్డి!

**బొబ్బిలిగామలో చెరువు కట్ట వెడల్పు పనుల ప్రారంభం**

**ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్**

**ప్రజానావ, సంగారెడ్డి:** సదాశివపేట మండలం బొబ్బిలిగామా, ఆత్మకూరు గ్రామాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని పనులను ప్రారంభించారు. బొబ్బిలిగామ గ్రామంలో 7.5 లక్షల రూపాయలతో చేపడుతున్న పిన్నకుంట చెరువు కట్ట వెడల్పు పనులకు ఆమె లాంఛనంగా శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం బొబ్బిలిగామ, ఆత్మకూరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. కొత్త ఇళ్లలోకి చేరుతున్న లబ్ధిదారులను అభినందించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సిద్ధన్న, మండల పార్టీ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ కోల్కూర్ మాణిక్ రెడ్డి, బొబ్బిలిగామ మాజీ సర్పంచ్ గోపాల్, సేవాదళ్ చైర్మన్ సందీప్ కులకర్ణి, ఏటిగడ్డ సంఘం మాజీ చైర్మన్ నర్సింలు తదితరులు హాజరయ్యారు. నాయకుల పర్యటనతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది.

# పోలీస్ గేమ్స్‌లో మెరిసిన మాధవి

**టేబుల్ టెన్నిస్‌లో జాతీయస్థాయిలో సత్తా చాటిన హుజూరాబాద్ ఏసీపీ**

**ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్‌తో పోలీస్ శాఖకు కీర్తి**

**ఏసీపీ ప్రతిభపై పోలీస్ అధికారుల ప్రశంసలు**

**ప్రజానావ, హుజూరాబాద్:** ఓవైపు కఠినమైన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూనే క్రీడల్లోనూ అసాధారణ ప్రతిభ కనబరిచిన హుజూరాబాద్ ఏసీపీ మాధవి జాతీయ స్థాయి-లో మరోసారి తన సత్తా చాటారు. ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన ఆలిండియా పోలీస్ గేమ్స్‌లో పాల్గొన్న ఆమె టేబుల్ టెన్నిస్ విభాగంలో ఒక సిల్వర్ మెడల్‌తో పాటు రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించి హుజూరాబాద్ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచారు. జాతీయ స్థాయి పోటీల్లో ఏసీపీ మాధవి సాధించిన విజయంపై హుజూరాబాద్ సబ్‌డివిజన్ పోలీస్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆమెను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. విధుల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ క్రీడాస్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రతిభ కనబరచడం ప్రశంసనీయమని కొనియాడారు. ఏసీపీ మాధవి విజయాలు మహిళా పోలీస్ సిబ్బందితో పాటు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.







# మాంసం దుకాణాల్లో ప్లాస్టిక్‌పై అధికారుల కొరడా!

**సిద్దిపేటలో మాంసం దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు**

**నిబంధనలు ఉల్లంఘించిన దుకాణదారులకు జరిమానా**

**స్టీల్ బాక్సులు తెచ్చిన వారికే మాంసం ఇవ్వాలని ఆదేశం**

**ప్రజానావ, సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆదేశాలతో పట్టణంలోని పలు మాంసం విక్రయ దుకాణాల్లో మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకం పూర్తిగా నిషేధించామని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మాంసం కొనుగోలు కోసం వచ్చే వినియోగదారులు స్టీల్ బాక్సులు లేదా పునర్వినియోగ పాత్రలు వెంట తెచ్చుకునేలా దుకాణదారులు అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు. స్టీల్ బాక్సులు తీసుకువచ్చిన వారికి మాత్రమే మాంసం విక్రయించాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న పలు దుకాణాల యజమానులకు అక్కడికక్కడే జరిమానాలు విధించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు మీరి ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాస్టిక్ రహిత సిద్దిపేట కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో మున్సిపాలిటీ జవాన్లు, పాల్గొన్నారు.

# సమగ్ర సవరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి!

**సంగారెడ్డిలో ఓటర్ల సవరణపై నిర్మలా జగ్గారెడ్డి అవగాహన**

**ఓటు హక్కుపై అపోహలు వీడాలని పిలుపు**




**ప్రజానావ, సంగారెడ్డి:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రజలందరూ తప్పక పాల్గొనాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ఈ కార్యక్రమంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ డెస్క్ వేదికగా ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలని ఆమె కోరారు. ఓటు హక్కు సవరణపై వస్తున్న అపోహలను ప్రజలు నమ్మవద్దని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రక్రియ వల్ల ఎవరూ తమ ఓటును కోల్పోరని స్పష్టం చేశారు. కేవలం రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న వారికి మాత్రమే దానిని ఒకే చోటకి పరిమితం చేస్తారని వివరించారు. ఈ సవరణ వల్ల ఓటర్ల జాబితాలో జవాబుదారీతనం పెరుగుతుందని, పారదర్శకతకు వీలుంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ పాల్గొన్నారు. కౌన్సిలర్ నవాజ్, సోహైల్, బబ్బుతో పాటు తహశీల్దార్ జైరాం నాయక్, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల కోసం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# వీహెచ్‌కు పూజల హరికృష్ణ శుభాకాంక్షలు!

**బాధ్యతలు స్వీకరించిన బీసీ సంక్షేమ శాఖ సలహాదారు**

**సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌ఛార్జి**



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన వి.హెచ్ హనుమంతరావును సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పూజల హరికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వి.హెచ్‌కు పూలమాల వేసి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. వి.హెచ్ హనుమంతరావు వంటి సీనియర్ నేత అనుభవం ప్రభుత్వానికి ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఆయన సూచనలు బీసీ వర్గాలకు ఎంతో మేలు కలిగిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ నేత బొమ్మల యాదగిరి పాల్గొన్నారు. వీరితో పాటు రాష్ట్ర మైనారిటీ నేత కలిముద్దీన్ అహ్మద్, కాంగ్రెస్ నాయకులు ఎర్ర మహేందర్, అక్బర్, బొమ్మల ప్రవీణ్, అశోక్ ప్రవీణ్ పాల్గొని వి.హెచ్ హనుమంతరావుకు అభినందనలు తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని నేతలు స్పష్టం చేశారు.

# పశువుల అక్రమ రవాణాపై డీసీపీ ఉక్కుపాదం!

**గూడెం చెక్ పోస్టులను తనిఖీ చేసిన డీసీపీ భాస్కర్**



**ప్రజానావ, దండేపల్లి:** దండేపల్లి మండలంలోని గూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాను అరికట్టడం, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఈ తనిఖీలు నిర్వహించారు. చెక్ పోస్టుల వద్ద భద్రతా చర్యలను పర్యవేక్షించి విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని డీసీపీ స్పష్టం చేశారు. సంబంధిత పత్రాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించాలని, ప్రతి వాహనం వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా ఉంటూ భద్రతా ప్రమాణాలను పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, అనుమానాస్పద రవాణా గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా 100 నంబర్‌కు సమాచారం అందించాలని డీసీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అక్రమ రవాణాపై పటిష్ట నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై సురేష్, దండేపల్లి ఎస్సై తైసినోద్దీన్ పాల్గొన్నారు.

